ప్రజాశక్తి

సోమవారం 23 సెప్టెంబర్ 2024 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

పలువురు కొత్త అధికారుల నియామకం

● కృష్ణాజిల్లా పంచాయతీ అధికారిగా అరుణ ● డ్వామా పీడీగా ప్రసాద్ యాదవ్ ● జడ్‌పి సిఇఒగా కన్నమ నాయుడు ● కొందరు బదిలీ

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : కష్ణాజిల్లాలో ఆదివారం పలువురు అధికారులు బదిలీ అయ్యారు. వారి స్థానాల్లో కొత్త అధికారులు నియమితులయ్యారు. కృష్ణాజిల్లా పంచాయతీ అధికారిగా జె.అరుణను నియమిస్తూ పంచాయతీరాజ్ రూరల్ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఉత్తర్వులు జారీచేశారు. ఆమె ప్రస్తుతం చిత్తూరు మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సోమవారం ఆమె బాధ్యతలు చేపట్టనున్నారు. గతంలో ఆమె కష్ణాజిల్లా పంచాయతీ అధికారిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. ఇప్పటివరకు ఇక్కడ జిల్లా పంచాయతీ అధికారిగా బాధ్యతలు నిర్వర్తించిన ఎస్వీ నాగేశ్వర్ నాయక్‌ను చిత్తూరు జిల్లాకు బదిలీ చేశారు.

డ్వామా పీడీగా శివ ప్రసాద్ యాదవ్

కష్ణాజిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఎన్.వి. శివప్రసాద్ యాదవ్‌ను నియమిస్తూ పంచాయతీ రాజ్ రూరల్ డవలప్‌మెంట్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన ఎన్టీఆర్ జిల్లా పంచాయతీ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే ఇప్పటివరకు కృష్ణాజిల్లా డ్వామా పీడీగా బాధ్యతలు నిర్వహించిన జీవి సూర్యనారాయణను ఎన్టీఆర్ జిల్లా పంచాయతీ అధికారిగా నియమించారు.

జడ్‌పి సిఇఒగా కన్నమ నాయుడు

కష్ణా జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారిగా కె.కన్నమ నాయుడును నియమిస్తూ పిఆర్ఆర్ డి కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ఏచూరి సంతాప సభలో మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారథి; హాజరైన జనం (అంతర్‌చిత్రంలో)

ప్రజాస్వామ పరిరక్షణకు పాటుపడిన ఏచూరి : మంత్రి సారథి

ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ఏచూరి తన గళాన్ని బలంగా వినిపించారని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి కొనియాడారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబివికె)లో ఆదివారం సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభ జరిగింది. ముందుగా ఏచూరి చిత్రపటానికి మంత్రి కె.పి.సారథి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సారథి మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనివార్యమైన తర్వాత కూడా పార్లమెంటులో లేదా అవకాశం వచ్చిన ప్రతిచోటా తెలుగు రాష్ట్రాలకు చట్టపరంగా రావాల్సిన వాటి గురించి ఎప్పుడు ప్రజాస్వామ్యానికి ముప్పు వచ్చినా దానిని పరిరక్షణకు ముందుకు వచ్చేవారన్నారు. పేదలు, పీడిత తాడిత ప్రజల అభ్యున్నతికి పోరాటాలు నిర్వహించారని కొనియాడారు. పెట్టుబడుల ఉపసంహరణకు ఆయన వ్యతిరేకమని, స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గళం వినిపించారని తెలిపారు. ఏచూరి జీవితం ఈ తరం రాజకీయ నాయకులకు ఆదర్శం కావాలని అన్నారు. ఎమర్జెన్సీ సమయంలో ఆయన చూపిన తెగువను గుర్తుచేసుకోవాల్సిన అవసరముందన్నారు. ఆయన ఎక్కడ ఉన్నప్పటికీ తెలుగుజాతి, తెలుగు నేలకు ఆత్మబంధువుగా ఉన్నారని, రాష్ట్ర అభివద్ధికి కృషి చేశారన్నారు. (పూర్తి వివరాలు మెయిన్ పేజీలో)

వైసిపి నేత గౌతంరెడ్డికి నిరసన సెగ

● రంగాపై వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని ధర్నా

ప్రజాశక్తి - గుడివాడ : వైసిపి నాయకులు పూనూరు గౌతంరెడ్డికి జనసేన శ్రేణుల నుండి నిరసన సెగ తగిలింది. త్వరలో జరిగే కష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలపై స్థానిక కె.ఎస్.ఫంక్షన్ హాల్లో గుడివాడ నియోజకవర్గంలోని వైసిపి నేతలతో ఆ పార్టీ రాష్ట్ర నేత, ఎపి ఫైబర్ నెట్ మాజీ చైర్మన్ గౌతమ్ రెడ్డి ఆదివారం సమావేశమయ్యారు. విషయం తెలుసుకొన్న రాధారంగ మిత్రమండలి సభ్యులు అక్కడికి చేరుకున్నారు. గతంలో వంగవీటి రంగాను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన గౌతంరెడ్డి క్షమాపణ చెప్పాలని నినాదాలు చేశారు. క్షమాపణ చెప్పనిదే ఆయనను ఇక్కడి నుండి వెళ్లనిచ్చేదిలేదని ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు రంగ ప్రవేశం చేశారు. అనంతరం గౌతంరెడ్డి సమావేశం నుండి అర్ధాంతరంగా వెనుదిరిగారు. రాధారంగా మిత్రమండలి సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు.

నిరసన తెలుపుతున్న రాధారంగా మిత్రమండలి కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు

మత్స్యకారుల అభివృద్ధికి కృషి : మంత్రి కొల్లు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మత్స్యకారులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు ప్రత్యేక పథకాలు రూపకల్పన చేస్తామని, ఎక్సైజ్, భూగర్భ వనరులు, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు. అవసరమైతే కేంద్ర ప్రభుత్వ నిధులను కూడా ఉపయోగించి మత్స్యకారులకు మరింత ఆర్థిక పరిపుష్టి కలిగిస్తామన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం సాంప్రదాయ మత్స్యకారుల ఆత్మీయ సభ జరిగింది. ఈ సభలో మంత్రి కొల్లు మాట్లాడుతూ మత్స్యకార సొసైటీ ఆధ్వర్యంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. మత్స్యకారుల ఐక్యతకు ఇటువంటి ఆత్మీయ సమావేశాలు దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, పూర్వ రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్రమౌళి, మాజీ ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపి మోపిదేవిని సత్కరిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

వరద ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగుదల

● 9 వేల మంది కార్మికుల వినియోగం
● 15 వేలకు పైగా మిక్స్‌డ్ వేస్ట్ తరలింపు
● విషజ్వరాలు ప్రబలకుండా చర్యలు
● 800 టన్నుల బ్లీచింగ్, 600 టన్నుల సున్నం వాడకం
● ప్రజాశక్తితో విఎంసి సిఎంఒహెచ్ డాక్టర్ పి.రత్నావళి

ప్రజాశక్తి - విజయవాడ : వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుదలకు, విషజ్వరాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు విజయవాడ నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగం ప్రధానాధికారి (సిఎంఒహెచ్) డాక్టర్ పి.రత్నావళి చెప్పారు. బుడమేరు, కృష్ణానది వరదల ప్రభావానికి గురైన నగరంలోని 32 డివిజన్ల పరిధిలో పేరుకుపోయిన చెత్తా చెదారం, ఇతర వ్యర్థాలు, పరుపులు, దిండ్లు, సోఫాలు, ఇతర ఫర్నీచర్ మొత్తాన్ని వేలాది మంది పారిశుధ్య కార్మికులతో అక్కడి నుండి తరలిస్తున్నట్లు చెప్పారు. ఎక్కడికక్కడ స్వీపింగ్, క్లీనింగ్ చేయించి, వందలాది ట్రాక్టర్లు, ప్రొక్లయినట్లు, టిప్పర్లు సాయంతో డంపింగ్ యార్డుకు తరలిస్తున్నట్లు తెలిపారు. అక్కడి నుంచి నగరం వెలుపుల ఇతర ప్రాంతాల్లో డంప్ చేస్తున్నట్లు చెప్పారు. అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, దోమల నివారణకు ఇంటింటికీ ఫాగింగ్ చేయిస్తూ పలు రకాల చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుదలకు తీసుకుంటున్న చర్యలపై సిఎంఒహెచ్ పి.రత్నావళి ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న : ప్రధానంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుదలకు తీసుకుంటున్న చర్యలేమిటి ?

వరద ప్రభావిత ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపిన వెంటనే పారిశుధ్యం మెరుగుదలకు నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగం చర్యలు చేపట్టింది. రాత్రింబవళ్లు వేలాది మంది కార్మికులతో పని చేయిస్తూ ఎక్కడికక్కడ స్వీపింగ్, క్లీనింగ్ చర్యలు తీసుకున్నాం. రాష్ట్ర ప్రభుత్వం, కలెక్టర్, విఎంసి కమిషనర్ ఆదేశాలు, సూచనల మేరకు ఇతర ప్రాంతాల నుండి కూడా పెద్దఎత్తున పారిశుధ్య కార్మికులను అక్కడికి తరలించాం. వీరంతా వీధులను శుభ్రం చేస్తున్నారు. గత ఇరవై రోజుల్లో సింగ్‌నగర్లోని ఎనిమిది డివిజన్లతోపాటు వన్‌టౌన్‌లోని హౌసింగ్ బోర్డు కాలనీ, ఊర్మిళానగర్, భవానీపురం, జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీ, రామలింగేశ్వర్‌నగర్, తారకరామానగర్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్యాన్ని ఒక ప్రత్యేక కార్యక్రమంగా తీసుకున్నాం. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూస్తున్నాం. ఈనెల 17వ తేదీనాటికి పారిశుధ్యం మెరుగుదల ఓ కొలిక్కి వచ్చింది.

ప్రశ్న : ఎంత మంది కార్మికులను అదనంగా వినియోగిస్తున్నారు ?

విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న (మిగతా 2లో)

రూ.50 లక్షల విలువైన 400 ఫోన్లు రికవరీ

బాధితులకు అందించిన సిపి రాజశేఖరబాబు

ప్రజాశక్తి - విజయవాడ : అపహరణకు గురైన, పోగొట్టుకున్న సుమారు రూ.50 లక్షల విలువైన 400 మొబైల్ ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సిఇఐఆర్), ఛాట్‌బోట్ పోర్టల్ల ద్వారా రికవరీ చేసిన ఫోన్లను బాధితులకు ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఆదివారం అందజేశారు. ఫిర్యాదుదారులు తమ మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నప్పుడు, పోలీసులకు ఫిర్యాదు చేస్తే, పోలీసులు ఐఎంఇఐ నెంబర్లు, అడ్రస్ ప్రూఫ్‌లను సిఇఐఆర్ పోర్టర్లో నమోదు చేసి ఫిర్యాదుదారులకు ఒక ఎకనాలెడ్జ్‌మెంట్ నెంబర్ ఇస్తారు. టెలికం సర్వీస్ ప్రొవైడర్ (టిఎస్‌పి) వారు ఐఎంఇఐ నెంబర్లను బ్లాక్ చేసి, ప్రస్తుతం ఆ ఫోన్‌ను వాడుతున్న వారి వివరాలను పోలీసులకు అందిస్తారు. ఇలా రికవరీ అయిన మొబైల్ ఫోన్ల ఐఎంఇఐ నెంబర్‌ను తిరిగి అన్‌బ్లాక్ చేసి ఫిర్యాదు దారులకు అందజేస్తారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు మాట్లాడుతూ ఫోన్లను రికవరీ చేసిన సైబర్ క్రైమ్ అధికారులను, సిబ్బందిని అభినందించారు. తమిళనాడు, తెలంగాణ, కేరళా ఇతర రాష్ట్రాల నుండి వీటిని రికవరీ చేసినట్లు తెలిపారు. సైబర్ క్రైమ్ సిటిజన్ యాప్ ద్వారా ఇప్పటి వరకు 18 వేల మందికి ఈ నేరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా సైబర్ క్రైమ్ పోలీసులు మొత్తం 1,785 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి ప్రజలకు తిరిగి అందజేసినట్లు తెలిపారు. మొదటి విడతగా 307 మొబైల్ ఫోన్లు, రెండో విడతగా 628 మొబైల్ ఫోన్లు రికవరీ చేసినట్లు తెలిపారు. అనంతరం సిపి రాజశేఖరబాబు పోలీసు కంట్రోల్ రూం, కమాండ్ కంట్రోల్ రూమ్‌లను పరిశీలించారు. సిసి కెమెరాల పనితీరును, ట్రాఫిక్ కంజెక్షన్ కోసం ఏర్పాటు చేసే ప్రత్యేకమైన సిసి కెమెరాలను పరిశీలించారు. డయల్ 100, 112 కాల్స్‌కు త్వరగా స్పందించి అతి తక్కువ సమయంలో వారి సమస్యలను పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. ఈకార్యక్రమంలో డిసిపి గౌతమి షాలి, ఎడిసిపి జి.రామ కష్ణ, ఎం.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు తిరిగి ఫోన్లు అందిస్తున్న సిపి రాజశేఖరబాబు

వరద బాధితుల అభ్యంతరాల నమోదు పరిశీలన

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం సాయంత్రం కండ్రిక, పాయకాపురం, ప్రకాష్‌నగర్, వాంబే కాలనీ, రాజీవ్ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో వరద బాధితుల నమోదును పరిశీలించారు. ఈసందర్భంగా ధ్యానచంద్ర మాట్లాడుతూ వరద వల్ల ప్రజలకు కలిగిన నష్ట గణన తర్వాత వచ్చిన లబ్ధిదారుల జాబితాను ఆయా 32 వార్డుల సచివాలయాల్లో ప్రదర్శిస్తున్నారని, వాటిలో ఏమైనా అభ్యంతరాలు ఉండే స్పెషల్ ఆఫీసర్, డిస్ట్రిక్ట్ ఆఫీసర్లకు తెలియజేవచ్చని పేర్కొన్నారు. సోమవారం కూడా అభ్యంతరాలను తెలుపవచ్చని ఆయన పేర్కొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - విజయవాడ : కలెక్టరేట్లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరిస్తామని తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు, డివిజన్, మునిసిపల్, మండల తహశీల్దారు కార్యాలయాల్లో సంబంధిత అధికారులు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం వరకు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

విఎంసి పరిధిలో...

విజయవాడ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం, జోనల్ కార్యాలయాల్లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జరుగుతుందని విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ ఫిర్యాదులను ఆయా కార్యాలయాల్లో అందజేసి పరిష్కారం పొందాలని ఆయన కోరారు.

దుర్గమ్మను దర్శించుకున్న తెలంగాణా హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి – వన్‌టౌన్ : తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇ.వేణుగోపాల్ తన కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం విజయవాడ కనక దుర్గమ్మను దర్శించుకున్నారు. అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దుర్గమ్మ దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ వేదపండితులు వేదాశీర్వాదం చేయగా, ఆలయ ఏఈవో దుర్గమ్మ శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

టిటిడికి కూరగాయల వితరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : గోవిందస్వామి భక్త సమాజం సింగపూర్ సంస్థ ప్రతినిధులు విజయవాడ నుండి తిరుమల తిరుపతి దేవస్థానానికి వితరణగా పంపించే కూరగాయల లారీని ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వైవి ఈశ్వరరావు ఆదివారం ఉదయం జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి నాదెండ్ల కష్ణ తదితరులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ కాంట్రాక్టు కార్మికులకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : వరద బాధితులైన శానిటేషన్ సెక్యూరిటీ కాంట్రాక్ట్ మహిళా కార్మికులకు ఆదివారం స్థానిక కొత్త ప్రభుత్వ ఆసుపత్రిలో సిఐటియు ఆధ్వర్యాన నిత్యావసరాలను పంపిణీ చేశారు. బాధిత కార్మికులకు సిఐటియు జిల్లా నాయకులు దోనేపూడి కాశీనాథ్ నిత్యావసర వస్తువుల కిట్లను అందజేశారు. నిత్యావసర వస్తువుల కిట్ల సేకరణకు వైద్యులు, ఏజిల్ గ్రూప్ సంస్థ వారు సహకరించారు. ఈ కార్యక్రమంలో కాశీనాథ్ మాట్లాడుతూ ఇటువంటి ఉపద్రవాలు వచ్చినప్పుడు మానవతా దక్పథంతో వ్యవహరించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు విజయవాడ తూర్పు సిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎన్.కోటి బాబు, విబి.రాజు, శానిటేషన్ సెక్యూరిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.తిరుపతమ్మ, ఐ.భాస్కరమ్మ, నాయకులు వి.కోటేశ్వరమ్మ, ఎస్‌కె.అఖిల, కె.కష్ణకుమారి, రత్నకుమారి పాల్గొన్నారు.

కార్మికులకు నిత్యావసరాల కిట్లు అందిస్తున్న సిఐటియు నాయకులు దోనేపూడి కాశీనాథ్

ప్రొఫెసర్‌పై దాడి చేసిన ఎంఎల్‌ఎపై చర్యలు తీసుకోవాలి : ఒపిడిఆర్

ప్రజాశక్తి - విజయవాడ : రంగరాయ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ ఉమామహేశ్వరరావుపై ఎంఎల్ఎ పంతం నానాజీ దాడి చేయడాన్ని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఓపిడిఆర్) ప్రధాన కార్యదర్శి వి.హనుమంత రావు తీవ్రంగా ఖండించారు. నానాజీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక ప్రజా ప్రతినిధిగా బాధ్యతాయుతమైన పదవిలో ఉండి, ఎవరో వచ్చి ఏదో చెబితే ముందు వెనుక ఆలోచించకుండా బాధ్యతా రాహిత్యంగా తన అనుచరులను వెంటబెట్టుకుని వెళ్లి ప్రొఫెసర్‌పై దాడి చేయడం గర్హనీయమని పేర్కొన్నారు. మంచీచెడు విచారించకుండా నానా రకాలుగా దుర్భాషలాడుతూ, భౌతికదాడికి పూనుకున్న ఎంఎల్ఎపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇది ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని పేర్కొన్నారు.

వరద పరిహారాలు రెట్టింపు చేయాలి

న్యూడెమోక్రసీ డిమాండ్

ప్రజాశక్తి - విజయవాడ : బుడమేరుకు శాశ్వత ముంపు నివారణ చర్యలు చేపట్టాలని, వరదల్లో మునిగిపోయిన ప్రతి కుటుంబానికి రూ.50 వేల చొప్పున, ప్రతి ఆటోకు రూ.25 వేల చొప్పున పరిహారం అందించాలని, పంట పొలాలకు ప్రకటించిన పరిహారాలను రెట్టింపు చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నేతలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పార్టీ ప్రచురించిన కరపత్రాన్ని ఆదివారం క్రీస్తురాజపురంలోని రామనర్సయ్య భవన్లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.ప్రసాద్, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, పిఒడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం లక్ష్మి, నాయకులు ఎ.రవిచంద్ర, వెంకటలక్ష్మి, పి.పద్మ, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - వన్‌టౌన్ : దసరా మహోత్సవ ఏర్పాట్లను ఆదివారం దుర్గగుడి ఇఒ కె.ఎస్.రామారావు, నగర పోలీసు ఎడిసిపి రామకృష్ణ పరిశీలించారు. ఆలయ ఇంజినీరింగ్ అధికారులు, వన్‌టౌన్ పోలీస్ సిబ్బందితో కలిసి ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహక ఇంజినీర్ లింగం రమ తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుదల

(మొదటి పేజీ తరువాయి)

కార్మికులతోపాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల నుంచి రప్పించిన కార్మికులు మొత్తం 9 వేల మంది కార్మికులను వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుధ్య పనికి వినియోగిస్తున్నాం. వీరంతా వరద ప్రభావిత ప్రాంతాల్లో రాత్రింబళ్లు పని చేస్తున్నారు. వీధులు, ఇళ్ల చుట్టూ పరిశుభ్రంగా ఉంచడానికి కార్మికులు తమ పనిలో నిమగ్నమయ్యారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ల సేవలను కూడా వినియోగించుకుంటున్నాము. ఇతర ప్రాంతాల నుండి వచ్చిన కార్మికులు, ఇన్‌స్పెక్టర్లు వారం క్రితమే తమ తమ ప్రాంతాలకు వెళ్లిపోయినా, కాంట్రాక్ట్ కార్మికులు, రోజువారీ వేతనాల కార్మికులతో పని చేయిస్తున్నాం. ఈనెల 9 నుంచి 17వ తేదీ వరకు 600 మంది కార్మికులను రోజువారీ కూలి ఇచ్చి పనిచేయించాం. ఇప్పటికీ స్వీపింగ్, క్లీనింగ్ జరుగుతూనే ఉంది.

ప్రశ్న : వరద ప్రభావిత ప్రాంతాల్లో బ్లీచింగ్, సున్నం ఏమేరకు వినియోగిస్తున్నారు ?

వీధులు, ఇళ్ల పరిసరాలను స్వీపింగ్, క్లీనింగ్ చేయించడంతోపాటు దోమలు, ఈగల నివారణకు, దుర్వాసన రాకుండా 800 టన్నుల బ్లీచింగ్, మరో 600 టన్నుల సున్నం కొనుగోలు చేశాం. ప్రత్యేకంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో చల్లించే కార్యక్రమం నిరంతరంగా జరుగుతూనే ఉంది.

ప్రశ్న : చెత్తా చెదారంతోపాటు ప్రధానంగా మిక్స్‌డ్ వేస్ట్ ఏ స్థాయిలో వచ్చింది ?

వరద ఉధృతికి ఇళ్లల్లో ఉన్న పరుపులు, సోఫాలు, దిండ్లు, ఇతర వేస్ట్ మొత్తం వీధుల్లో, సందుల్లో భారీ ఎత్తున మేట వేసింది. జనజీవనానికి, రాకపోకలకు ఇబ్బంది లేకుండా వేలాది మంది కార్మికులను, పెద్దఎత్తున వాహనాలను ఏర్పాటు చేసి అత్యవసరంగా మిక్స్‌డ్ వేస్ట్‌ను తొలగించాం. ఇతర ప్రాంతాలకు దానిని తరలించాం. ఇప్పటి వరకు 15 వేల టన్నులకుపైగా వేస్ట్‌ను ఇతర ప్రాంతాలకు తరలించాం. ఇది చాలా పెద్ద పని.

ప్రశ్న : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, దోమల నివారణకు తీసుకుంటున్న చర్యలేమిటి ?

వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలు విషజ్వరాల బారిన పడకుండా కాచిచల్లార్చిన నీటిని తాగాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వేడి ఆహారం తీసుకోవాలి. మటన్, చికెన్ లాంటివి తినొద్దు. వరద ప్రభావిత ప్రాంతాల్లో విస్తృతంగా ఫాగింగ్ చేయిస్తున్నాం. ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేయిస్తున్నాం. మలాతిన్, ఆయిల్ బాల్స్, గంబూషియా చేపలు తదితరాలను విరివిగా ఉపయోగిస్తూ మురుగు కాల్వల్లో దోమలు పెరగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం.

'ఠాగూర్'ను సందర్శించిన గ్రంథాలయ శాఖ డైరెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ : బందరు రోడ్డు గవర్నరుపేటలోని ఠాగూర్ గ్రంథాలయంలో విద్యార్థులకు ప్రతీ ఆదివారం నిర్వహించే 'చదవటం మాకిష్టం' కార్యక్రమాన్ని రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ సంచాలకులు డాక్టర్ ఎం.ఆర్.ప్రసన్న కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో కథలు చెప్పించారు, చదివించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిణి కె.రమాదేవి మాట్లాడుతూ విద్యార్థులకు చిత్ర లేఖనంలో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

సాగునీరందక నెర్రెలిచ్చిన పొలాలు

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండలం పూషడం గ్రామ రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఎగువ నుంచి వచ్చే సాగునీరు సరిగా అందక గత నెల రోజుల క్రితం తీవ్ర ఇబ్బందులు పడిన రైతులకు ఆకస్మాత్తుగా వచ్చిన వర్షాల కారణంగా సాగునీరు అందింది. దీంతో వ్యవసాయ పనులు ప్రారంభించిన పూషడం గ్రామ రైతులకు ఆ తర్వాత క్రమేపీ పంట కాలువ ద్వారా సాగునీరు రాకపోవటంతో పంట భూములు నెర్రలిచ్చే దుస్థితి నెలకొంది. పూషడం గ్రామంలో మొత్తం 700 ఎకరాలకుపైగా సాగు చేస్తుండగా దాదాపు 500 ఎకరాల మేర సాగునీరు అందట్లేదని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పంటను ఎలా బ్రతికించుకోవాలో అర్థం కాక నానా పాట్లు పడుతున్నారు. యండకుదురు బ్రాంచి కాలువ కింద సాగు చేస్తుండగా, అడుగుకు పైగా సాగునీరు కనిపిస్తుంది. ఇది పంట పొలాలకు ఏ మాత్రం సరిపోదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా సాగునీరు అందక నానా అవస్థలు పడుతున్నామని అధికారులకు తెలియజేస్తే ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేస్తూ కాలం వెళ్ల దీస్తున్నారని, పంట పొలాలు నెర్రలిచ్చి దర్శనమిస్తున్నాయని తెలిపారు. రైతులు అధికారులకు ఫోన్ల ద్వారా తెలియజేస్తున్నా సాగునీరు విడుదల అవుతుంది.. రేపోమాపో వస్తాయని దాటదోరణి అవలంభిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా మల్లాయిచిట్టూరు శివారు ప్రాంతం, యండకుదురు శివారు ప్రాంతాల్లోని పంట భూములు సాగునీరు లేక నెరలిచ్చి దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా సక్రమంగా సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని ప్రజాప్రతి నిధులను, అధికారులను రైతులు వేడుకుంటున్నారు.

యండకుదురు బ్రాంచి కాలువ దుస్థితి

సాగునీరు అందక నెర్రలిస్తున్న పంట పొలాలు

మాట్లాడుతున్న దొంతు చిన్నా

యార్లగడ్డపై ఆరోపణలు రుజువు చేయాలని టిడిపి సవాల్

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం ఎమ్మెల్యే యర్లగడ్డ వెంకట్రావుపై విజయ డైరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు చేసిన ఆరోపణలు రుజువు చేయాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దొంతు చిన్నా సవాల్ చేశారు. ఆదివారం గన్నవరం టిడిపి కార్యాలయం లో విలేఖర్ల సమావేశంలో చిన్నా మాట్లాడుతూ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఉద్యోగుల పై ఎమ్మెల్యే దాడి చేశారని చెప్పడం అవాస్తవం అని, ఆరోపణలు ఆధారాలతో రుజువు చేయాలని అన్నారు. ఎమ్మెల్యే కు మంత్రి పదవి ఇవ్వలేదని యార్లగడ్డ అలిగినట్లు ఆరోపణ చేయటం సరికాదన్నారు. చంద్రబాబు పిలుపు మేరకు వరద ప్రాంతంలో తన సొంత నిధుల లతో ఎంఎల్‌ఏ సహాయ చర్యలు చేపట్టారని అన్నారు. 2019లో వైసిపి వాళ్ళను డైరెక్టర్లుగా గెలిపించావనీ, ఇపుడు టిడిపి పంచన చేరటానికి ఎత్తులు వేస్తున్నావు అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి మహిళ అధ్యక్షులు మేడిపల్లి రమ్య, ఎస్ కె రఫీ, సీనియర్ టిడిపి నాయకులు బొమ్మదేవర సత్యనారాయణ, కాసర్నేని రంగబాబు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మృతునికి నివాళి

ప్రజాశక్తి-పెదపారుపూడి : మండలంలోని జువ్వనపుడి గ్రామంలో గండ్రపు శివమహేష్ మరణించగా అతని భౌతికకాయానికి పామర్రు ఎంఎల్‌ఏ వర్ల కుమార్ రాజా , పామర్రు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ తాడిశెట్టి నరేష్, దగాని లెల్లిన్ తదితరులు నివాళులర్పించారు.

వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-చల్లపల్లి : ఇటీవల కష్ణా నది వరద ఉధతికి నష్టపోయిన బాధితులకు స్వచ్ఛంద సేవా సంస్థలు చేయూతనివ్వాలని సోలెస్ ఫౌండేషన్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు రెవరెండ్ పి దేవదానం పిలుపు నిచ్చారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వరద బాధిత గ్రామమైన కొయ్యగూరపాడులో వంద మందికి దుప్పట్లు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు వచ్చి వరద బాధిత గ్రామాల పునర్నిర్మాణాన్ని చేపట్టాలని సూచించారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న దేవదానం

ఎస్ఐకు సన్మానం

ప్రజాశక్తి ఘంటసాల : యువత సన్మార్గంలో పయనించి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చుదిద్దుకోవాలని ఘంటసాల ఎస్ఐ కె.ప్రతాప్ రెడ్డి అన్నారు. ఘంటసాల మండలం కొడాలి గ్రామానికి చెందిన జీఎన్నార్ యూత్ ఘంటసాల పోలీస్ స్టేషన్లో ఎస్ఐ ప్రతాప్ రెడ్డిని ఆదివారం సాయంత్రం దుశ్శాలువాతో సత్కరించారు. ఇటీవల జరిగిన వినాయక చవితి సందర్భంగా నవరాత్రుల ఉత్సవాల్లో ఎలాంటి సంఘటనలు జరగకుండా బందోబస్తు పర్యవేక్షించడంతో పాటు వినాయకుని నిమజ్జనం ఊరేగింపులో ప్రజలకు ఇబ్బందుల్లేకుండా విజయవంతం కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి సహకరించిన పోలీసు సిబ్బందికి జీఎన్నార్ యూత్ కతజ్ఞతలు తెలియజేశారు. జీఎన్నార్ యూత్ సభ్యులు గుంటూరు కార్తీక్, కనగాల శివాజీ, సిద్దెల పవన్, చంద్ర శశికాంత్, దేవరపల్లి శ్రీనివాస్ ఉన్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్వర్ణ ఉత్సవాల్లో భాగంగా కృష్ణా జిల్లా స్థాయి ఆటల పోటీలు ఆదివారం అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. క్రికెట్ పోటీలలో గుడివాడ జట్టు ప్రథమ స్థానం సాధించగా నాగాయలంక జట్టు ద్వితీయ స్థానం సాధించింది. వాలీబాల్ లో అవనిగడ్డ మొదటి స్థానం సాధించగా గుడివాడ జట్టు రెండో స్థానం సాధించింది. కష్ణాజిల్లా స్థాయి స్పోర్ట్స్ కమిటీ గా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు బి కనకారావు, జిల్లా శాఖ కార్యదర్శిగా బిజీ గోపాలకష్ణ, ఎన్ వెంకటేశ్వరరావు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్లుగా పి శివ కోటేశ్వరరావు, లంకె నరేంద్ర అవనిగడ్డ మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు జివేంద్రరావు బి శివరామకష్ణ పాల్గొని పోటీలను పర్యవేక్షించారు.

వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా అధ్యక్షులు కనకారావు

రాత్రిళ్లు గస్తీ ముమ్మరం

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్‌రావు ఆదేశాలతో జిల్లాలో రాత్రి గస్తీ ముమ్మరం చేసినట్లు ఎస్పీ కార్యాలయం తెలిపింది. అందులో భాగంగా నైట్ రౌండ్స్ ఆఫీసర్స్ నిరంతరం బీట్ పాయింట్స్ తనిఖీ చేసి, ప్రార్థన మందిరాలు, ఏటిఎంలు, వ్యాపార సముదాయాల వద్ద సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ఎటువంటి నేరాలు జరగకుండా పకడ్బందీగా గస్తీ విధులు నిర్వర్తించాలని ఎస్పీ సూచించారు. హైవేలలో డయల్ 100, హైవే మొబైల్స్ వాహనాల ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలలో భాగంగా నిద్రమత్తులో రోడ్డు ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లు ఫేస్ వాష్ చేసుకుని వెళ్ళేవిధంగా వాష్ అండ్ గో నిర్వహించి వారికి అవగాహన కల్పిస్తున్నారు. అదేవిధంగా వారి వారి బీట్ ఏరియాలో ఉన్న నేర చరిత్ర గల వారిని తనిఖీ చేస్తూ వారి కదలికలపై నిఘా ఉంచుతున్నారు. అనుమానిత వాహనాల తనిఖీలు నిర్వహణ, వాహన రికార్డ్స్ పరిశీలన, ప్రయాణికులను తనిఖీ చేసి అనుమానిత వ్యక్తుల వివరాలు, వారి వేలిముద్రలు సేకరించి దొంగతనాలు జరగకుండా,శాంతిభద్రతల పరిరక్షణ, అక్రమ రవాణా, నేర నియంత్రణకు జిల్లా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు.

వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి-గన్నవరం : రహదారి ప్రమాదల నివారణలో భాగంగా అధికారుల ఆదేశాల మేరకు ఆదివారం టోల్ ప్లాజా వద్ద సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేసినట్లు ఆత్కూరు ఎస్సై సురేష్ చావా తెలిపారు. నిషేధిత బ్లాక్ ఫిల్మ్ వేయించిన కార్లను ప్రత్యేకంగా గుర్తించి వాటి యజమానులకు జరిమానాలు విధించారు. 15 వాహనాలను గుర్తించి వాటికి రూ. 9,025 జరిమానా విధించినట్లు చెప్పారు.

జరిమానా విధిస్తున్న ఎస్ఐ సురేష్

27న ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు వర్ధంతి పురిస్కరించుకొని అవనిగడ్డలో గాంధీ క్షేత్ర కమిటీ గ్రామీణ యువజన వికాస సమితి రోటరీ క్లబ్ లైన్స్ క్లబ్ ఆఫ్ కోడూరు వారి ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీన ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరం పోస్టర్లను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ఆవిష్కరించారు. వైద్య శిబిరం నిర్వహణకు చొరవ తీసుకున్న లైన్స్ క్లబ్ ఆఫ్ కోడూరు దీవి సీమ అధ్యక్షులు పూత బోయిన సీతారత్నం సాయిబాబును ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా విజయవాడ హెచ్ సి జి డాక్టర్ గోపీచంద్ క్యాన్సర్ హాస్పటల్ క్యాపిటల్ ఆస్పటల్ వారి సౌజన్యంతో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ శిబిరంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలలతో పాటు మిగిలిన రోగాలకు కూడా ఉచితంగా పరీక్షలు చేస్తారని, ఈ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సీతారత్నం సాయిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాంధీ క్షేత్రం కమిటీ కార్యదర్శి మట్టి శ్రీనివాసరావు, జనసేన లీగల్ సెల్ కార్యదర్శి వాసు నాంచారయ్య నాయుడు, కోడూరు మండల జనసేన పార్టీ అధ్యక్షులు మర్రి గంగయ్య పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

'శ్రీ విశ్వశాంతి' ఉపాధ్యాయుడికి అవార్డు

మధుబన్ హిందీ అవార్డు అందుకుంటున్న శ్రీ విశ్వశాంతి స్కూల్ హిందీ ఉపాధ్యాయుడు సుబ్బారావు

ప్రజాశక్తి ఉయ్యూరు : శ్రీవిశ్వశాంతి స్కూల్ హిందీ ఉపాధ్యాయుడు జీవీ సుబ్బారావుకు మధుబన్ హిందీ అవార్డు లభించింది. హిందీ శిక్షక్ సమ్మాన్ సమారోహ్ కార్యక్రమంలో భాగంగా మధు బన్ పుస్తక ప్రచురణ కంపెనీ ఈనెల 20న బెంగళూరులో భారతీయ విద్యాభవన్లో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లోని పలువురు హిందీ ఉపాధ్యాయుల ను ఘనంగా సత్కరించగా అందులో సుబ్బారావు ఒకరుగా నిలిచారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీబీఎస్ఈ బోర్డు 2024 పరీక్షలో హిందీలో అద్భుత ప్రతిభ కన పరచిన విద్యార్థులతో పాటు వారికి బోధించిన ఉపాధ్యాయులకు మధుబన్ సంస్థ అవార్డులు ప్రధానం చేసి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించినట్టు తెలిపారు. దక్షి ణభారత దేశంలో హిందీ ఉపాధ్యాయులు, విద్యార్థులను ప్రోత్సహించడానికి ఈ అవా ర్డులు ప్రధానం చేస్తారని అరుదైన ఈపురస్కారానికి తమ ఉపాధ్యాయుడు సుబ్బారా వు, ముగ్గురు విద్యార్థినులు ప్రతిక్షప్రియ, పి.వర్షిణి, సష్టిసింగ్ ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమని శ్రీవిశ్వశాంతి విద్యాసంస్థల చైర్మన్ మాదల సుబ్రమణ్యేశ్వరరా వు, డైరెక్టర్లు సూర్యశేఖర్, సుష్మ, ప్రిన్సిపాల్ కాజ పద్మవాణి అభినందించారు.

గిరిజన తండాల్లో రోడ్ల నిర్మాణం : కొలికపూడి

ప్రజాశక్తి-ఎ.కొండూరు: ఉపాధి హామీ చట్టం ద్వారా నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు రూ.5 కోట్ల చొప్పున నిధులు మంజూరు అయ్యాయని నిధులతో ఏ కొండూరు మండలంలో ముందుగా గిరిజన తండాల్లో సిమెంట్ రోడ్లు డ్రైన్లు నిర్మాణం చేపడతామని తిరువూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన ఏ కొండూరులో స్వచ్ఛ హి సేవ ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన గ్రామంలోని డ్రైనేజీ ని పరిశీలించి ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏ కొండూరు సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ గిరిజన తండాల్లో రోడ్లు లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తండావాసుల సమస్యలను తీర్చడానికి ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను కూడా వినియోగించడం జరుగుతుందని చెప్పారు. అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవాలని చూస్తే ఎవరిని ఉపేక్షించేది లేదని ఈ మండలంలోని రాజకీయ నాయకులు గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించకుండా తమ స్వార్థ ప్రయోజనాల కొరకు రాజకీయాలను వాడుకుంటున్నారని అన్నారు వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి ఏ కొండూరు మండలంలోని ప్రతి ఇంటికి తాగునీటి నిమిత్తం కృష్ణా జలాలను కుళాయిల ద్వారా సరఫరా చేయడం జరుగుతుందని పైప్ లైన్ పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు ఏ కొండూరు మండలంలో తాగు నీటి సమస్య మినహా మండల అభివృద్ధికి ప్రజా అవసరాలకు కావలసిన అన్ని వనరులు ఉన్నాయని వాటిని వినియోగించుకోవడంలో ఇప్పటివరకు రాజకీయ నాయకులు విఫలం అయ్యారని ఇంతకుముందు రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొవాలని సూచించారు రాష్ట్రంలోనే తిరువూరు నియోజకవర్గం వెనక పడి ఉందని నియోజకవర్గంలో ఏ కొండూరు మండలం వెనకబడి ఉందని అందువల్ల రాజకీయ నాయకులు రాజకీయాలను పక్కనపెట్టి అభివృద్ధికి సహకరించాలని చెప్పారు. అనంతరం ఆయన కస్తూరిబా గాంధీ పాఠశాల కళాశాల సందర్శించి బాలికలకు అందుతున్న వసతులపై బాలికలను అడిగి తెలుసుకున్నారు అనంతరం ఆయన బాలికలతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపిఆర్‌డి శ్రీకృష్ణ పరమాత్మ , కేజీ బివి విద్యాలయ ప్రిన్సిపల్ షేక్ మీరున్నిస, టిడిపి మండల అధ్యక్షులు గడ్డి కృష్ణారెడ్డి, మాజీ ఏఎంసి చైర్మన్ అలవాల రమేష్‌రెడ్డి, వి మునియా, సర్పంచ్ వేంపాటి రజిని పాల్గొన్నారు.

మాట్లాడతున్న ఎంఎల్‌ఎ కొలికపూడి

ఆర్థిక సహాయం అందజేత

ప్రజాశక్తి - భవానీపురం

బ్లాక్ నంబర్ 13లో నివసిస్తున్న పేద మహిళ బెన్నబత్తుల పార్వతి అనారోగ్యంతో ఇటీవల మృతిచందారు. వారి కుటుంబానికి హౌసింగ్ బోర్డ్ కాలనీ 300, 450 ఓనర్స్ అండ్ రెంట్ అసోసియేషన్ కమిటీ కాలనీ ప్రజల సహకారంతో రూ.35 వేల ఆర్థిక సహాయన్ని మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య చేతుల మీదగా వారి కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పిట్టల సాంబశివరావు, సీత చంద్రశేఖర్, ఎస్పీ శేషగిరిరావు, పి నాగరాజు, టి.సంధ్య, ప్రమోదిని, నజీబ్, విశ్వనాధ్ ప్రసాద్ కునపరెడ్డి నాగభూషణం, కాశీ తదితరులు పాల్గొన్నారు.

చిత్రకారుడు జగన్మోహనరావుకు అవార్డు

ప్రజాశక్తి-వన్‌టౌన్: ప్రముఖ చిత్రకారుడు, గిరిజన గీత శిల్పి బొండా జగన్మోహనరావుకు ఢిల్లీకి చెందిన ది క్రేజీ టేల్స్ వారి ప్రతిష్టాత్మకమైన ఇన్ఫ్లుఎంషియల్ ఇండియన్ 2024 అవార్డు లభించింది.

సమాజంలోని వివిధ పథకాలకు సంబంధించిన అంశాలపై ఆలోచింపచేసే రీతిలో అనేక చిత్రాలను వేసినందుకు ఈ అవార్డును అందజేసింది. భవానిపురం హౌసింగ్ బోర్డ్ కాలనీలో నివాసం ఉంటున్న ఆయన అవార్డును కొరియర్ ద్వారా అందుకున్నారు. ఈ సందర్భంగా జగన్మోహనరావు మాట్లాడుతూ సమాజంలోని అట్టడుగు వర్గాల వారి జీవిత విధానాలను తాను అధ్యయనం చేయడం జరిగిందన్నారు. వీరిలో ముఖ్యంగా గిరిజనుల జీవనవిధానంపై వందలాది చిత్రాలను తాను వేయడం జరిగిందని వివరించారు. సమాజంలోని విభిన్న అంశాలను సృజిస్తూ తాను గీచిన చిత్రాలకు ఇప్పటివరకు 200లకు పైగా జాతీయ, అంతర్జాతీయ అవార్డులను అందుకున్నట్లు తెలిపారు.

500 మందికి బియ్యం, దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: టిడిపి వందరోజుల పాలన సందర్భంగా ఇబ్రహీంపట్నం ప్రసాద్ నగర్ క్రీస్తు సంఘం ఆధ్వర్యంలో 500 మందికి బియ్యం దుస్తులు, నగదు పంపిణీ కార్యక్రమం క్రీస్తు సంఘం ఇవాంజెలిస్ట్ నల్లమోతు విజయ రావు(చంటి) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలనకు కృషి చేయాలన్నారు. ఇటీవల వచ్చిన వరదలకు బాధితులను క్రీస్తు సంఘం ఆదుకుందని గుర్తు చేశారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిపాలన పేద ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని అన్నారు. శాసనసభ్యులు వసంత వెంకట కష్ణ ప్రసాద్ నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటున్నారని అన్నారు. టిడిపి రోజుల సుపరిపాలన సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, స్థానిక శాసనసభ్యులు వసంత వెంకట కష్ణ ప్రసాద్ ల అభిమానం సాక్షిగా ఆదివారం ప్రసాద్ నగర్ క్రీస్తు మందిరం నందు 500 మంది పేదలకు 25 కిలోల బియ్యం, దుస్తులు, రూ.500 నగదు అందించారు. ఈ కార్యక్రమంలో నల్లమోతు సువర్ణ ప్రసాద్, నల్లమోతు ప్రసాదరావు పాల్గొన్నారు.

30న కాంట్రాక్టు కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్‌లో ఈ నెల 30న జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ కోరారు. ఇబ్రహీంపట్నం సిఐటియు విస్తృత స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం విటిపియస్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, ప్రభుత్వ ఆఫీసుల్లో పని చేస్తూ అనేక సమస్యలతో సతమతమవుతున్న కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ వర్కర్స్‌ని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్స్ డేలో భాగంగా జరిగే ధర్నాలో కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఎం.మహేష్, సిఐటియు నాయకులు గోపికృష్ణ, రవి, సూరిబాబు, హరి ప్రసాద్, బాలకృష్ణ, దుర్గారావు, కన్నయ్య, ఇమ్మానేయులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మైలవరం: ఇటీవల వరదల్లో మైలవరం పట్టణానికి చెందిన దుర్గాప్రసాద్ అనే యువకుడు విద్యుత్ ఘాతానికి గురై మృతిచెందాడు. ఆదివారం మైలవరంలోని మృతుని నివాసానికి స్థానిక శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.5 లక్షల చెక్కును అందజేశారు.

శ్మశానవాటిక అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-గంపలగూడెం: దీర్ఘకాలికంగా శ్మశాన వాటిక స్థలం కంపచెట్లతో పేరుకుపోయి ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు పెనుగొలను గ్రామ సర్పంచ్ సంగీత లలిత కుమారి తెలిపారు. ఆదివారం కంపచెట్లను జెసిబి ద్వారా తొలగించే కార్యక్రమాన్ని లలితకుమారి ప్రారంభించారు. దళితుల అవసరార్థం సుమారు 5 ఎకరాలు స్థలం ఉందని తెలిపారు. మతదేహాలను తరలించేందుకు ఇబ్బందులు కలుగుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.

అద్దె కార్ల మోసగాడు ఎక్కడ?

పోలీసులను వేడుకుంటున్న యజమానులు

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ పట్టణంలో పదుల సంఖ్యలో చుట్టుపక్కల పట్టణాల్లో కార్ల యజమానులను మోసం చేసిన మోసగాడు పోలీసులకు సవాల్‌గా మారాడు. నందిగామలో ముళ్ల డాక్టర్ శ్రీరామనేని రామకృష్ణ , కుమారుడు పవన్ సాయి అలియాస్ నాని కార్ రెంటల్ వ్యాపారం అంటూ వారి వాహనాలను లీజుకు తీసుకుని, తర్వాత తనఖా పెడతాడు. సుమారు ఆరు కార్లను నందిగామ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పవన్ సాయి తమ కారును నెలవారీ అద్దెకు తీసుకుని మోసం చేశాడని ఇటీవల కార్ల యజమానులు చాలామంది నందిగామ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కొంతకాలంగా రామకృష్ణ కార్ రెంటల్స్ పేరుతో వ్యాపారం ప్రారంభించి ఫైనాన్స్‌లో ఉన్న కార్లను కంటిన్యూషన్ పేరుతో తాకట్టు పెట్టినట్టు పోలీసులు గుర్తించారు. అతను కారు యజమానులతో కారు లీజు, అద్దె ఒప్పందాన్ని కుదుర్చుకునేవాడు. తర్వాత పవన్‌సాయి వాహనాలను తనఖా పెట్టి ఒక్కొక్కరి నుంచి లక్షల వరకు అప్పులు తీసుకుంటాడు. అతను యజమానుల నుండి తప్పించుకొని తిరుగుతుండటంతో బాధితులు నందిగామ పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతన్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు విచారించి కార్ల దొంగను పట్టుకోవాలని యజమానులు కోరుతున్నారు.

ఐఎస్‌బి పీజీ ప్రోగ్రామ్

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: మేనేజ్‌మెంట్ విద్యలో కొత్త బెంచ్‌మార్క్‌లను నెలకొల్పడానికి ప్రసిద్ధి చెందిన ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్బి), భవిష్యత్తు నాయకులను తీర్చిదిద్దే లక్ష్యంలో మరో సంచలనాత్మక ప్రోగ్రాం పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ ఫర్ యంగ్ లీడర్స్ (పీజీపీ వైఎల్)ను ప్రారంభించినట్లు సంస్థ మార్కెటింగ్ ప్రతినిధి కె . రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025 మధ్య నుండి ప్రారంభమయ్యే ఈ 20 నెలల పీజీపీ వైఎల్‌లో బిజినెస్ డిజైన్ ల్యాబ్, ఇన్నోవేషన్ ల్యాబ్‌తో సహా ముఖ్యమైన అనుభవపూర్వక అభ్యాస భాగాలు చేర్చి పాఠ్యాంశాలు రూపొందించబడ్డాయి అని తెలిపారు. దీనిలో విద్యార్థులు తప్పనిసరిగా రెండు నెలల వేసవి ఇంటర్న్‌షిప్‌ను పూర్తి చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఐఎస్బి, ఇతర అత్యుత్తమ అంతర్జాతీయ బి-పాఠశాలల నుండి ప్రఖ్యాత అధ్యాపకులు బోధిస్తారని అన్నారు.

బిగాస్ ఎలక్ట్రిక్ స్కూటర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ప్రముఖ ఎలక్ట్రిక్ స్కూటర్ బ్రాండ్ బిగాస్ కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్ 'ఆర్‌యువి 350 మాక్స్'ను ఆదివారం కరెన్సీనగర్‌లోని బిగాస్ షోరూమ్ నందు మార్కెట్లోకి ప్రారంభించింది. ఎలక్ట్రిక్ స్కూటర్‌ను సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.కిషోర్‌బాబు ఆవిష్కరించారు. ఈసందర్భంగా హితికా మోటార్‌ఎస మేనేజింగ్ పార్టనర్ హర్షవర్ధన్ మాట్లాడుతూ విజయవాడలో బిగాస్ అధీకృత డీలర్‌గా ఉన్నామని ఎలక్ట్రిక్ స్కూటర్లను మార్కెట్ చేయడంలో అగ్రస్థానంలో ఉన్నట్లు తెలిపారు. ఆర్‌యువి 350 మాక్‌ఎస అనేది అత్యంత ప్రత్యేకమైన స్కూటర్లలో ఒకటన్నారు.కేంద్ర ప్రభుత్వం వారి ఫేమ్ సబ్సిడీతో అందిస్తున్నారన్నారు. ఆర్‌యువి 350 మాక్స్ 145 కిలో మీటర్ల అరై సర్టిఫైడ్ శ్రేణి కలిగిఉందని తెలిపారు. ఇది రెగ్యులర్ రోజువారీ ప్రయాణాల, వాణిజ్య ప్రయోజనాల కొరకు కూడా ఉపయోగించబడుతుందని అన్నారు. అతి తక్కువ డౌన్ పేమెంట్ రూ.4999లకే అందిస్తున్నామని తెలిపారు. వివరాలకు హితికా మోటార్స్ 9949336051 నెంబర్‌కు సంప్రదించవచ్చని తెలిపారు. ఈకార్యక్రమంలో పలువురు నగర ప్రముఖులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: తిరుమలగిరి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన లక్కిరెడ్డి కోటిరెడ్డి, ధనలక్ష్మి రూ.45,116 విరాళంగా అందజేశారు. దాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం అందజేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ వరప్రసాద్ తెలిపారు.



కుళ్లిపోయిన పంటపొలాలు

ఊహకందని నష్టం..

సాయం చేయకుంటే కష్టం

- పది రోజులకుపైగా పొలాల్లో మురుగునీరు
- కుళ్లిపోయిన పంటలు
- ఆదుకోవాలని రైతులు వేడుకోలు

ప్రజాశక్తి-గన్నవరం : బుడమేరు ప్రభావం గన్నవరం మండలంలో ఐదు గ్రామాలపై తీవ్రంగా పడింది. వేలాది ఎకరాల్లో పచ్చని పంట పొలాలు 12 రోజులు ముంపునకు గురై ప్రస్తుతం కుళ్లి కంటతడి పెట్టి స్తున్నాయి. బుడమేరు కట్టలకు సమాంతరంగా దాదాపు 5 కిలోమీటర్లు ఇదే దుస్థితి చూపరుల హృదయాలను కలచి వేసే విధంగా ఉంది. గత 50 ఏళ్లలో ఎన్నడూ ఇంతటి విపత్కర పరిస్థితి, నష్టం ఎదురవ్వలేదని ఆయా గ్రామాలకు చెందిన వృద్ధులు వాపోతున్నారు. ఈ నష్టం నుంచి కోలుకోడానికి ఎన్నేళ్ల పడుతుందోనని కన్నీటి పర్యంతమవుతున్నారు. ముస్తాబాద నుంచి కేసరపల్లి వరకు బుడమేరు వ్యాపించి ఉంది. ముస్తాబాద, జక్కుల నెక్కలం, సావరగూడెం, కేసరపల్లి, గూడవల్లి ఐదు గ్రామాల్లో మరింత భారీ నష్టం కనపడుతోంది. 2009లో బుడమేరు వరద సమయంలో రెండు మూడు రోజుల్లోనే నీరు బయటకు పోవడంతో నష్టం పరిమితంగా ఉంది. కానీ ఇప్పుడు 12 రోజులు పంట పొలాల్లోనే నీరు నిల్వ ఉండడంతో ఉరకను తట్టుకునే వరి సైతం సర్వనాశనమైంది. నష్టపోయిన రైతులు ప్రత్యామ్నాయ పంట వేయడానికి అవకాశం లేక, జరిగిన నష్టాన్ని ఏ విధంగా పూడ్చుకోవాలో తెలియక మధన పడుతున్నారు.

పంట ప్రత్యామ్నాయం చూపాలి :

ఎస్. సాంబశివరావు, రైతు

రెండు ఎకరాల్లో వరి వేయగా తుడిచి పెట్టుకు పోయింది. పేద సన్న కారు రైతును. నష్టం రూ. 40 వేలు కాగా గడ్డి, పచ్చిమేత కూడా పశువులు అల్లాడుతు న్నాయి. ప్రభుత్వం సాయంతో పాటు ప్రత్యా మ్నాయ సాగుకు దారి చూపాలి.

రైతులను పూర్తిగా ఆదుకోవాలి

కౌలు రైతు, పాండురంగారావు, సావరగూడెం,

3 ఎకరాలు వరి వేశాం. వర్షాలకు వరి దెబ్బతింది. నష్టం సుమారు రూ.60 వేలు వరకు ఉంది. అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలన చేసి నష్టపరిహారం అందేలా చూడాలి. బుడమేరు కట్టను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకోవాలి.

బుడమేరు ముంచేసింది

కౌలు రైతు కాకాని, సావర గూడెం,

5 ఎకరాల్లో పంట కుళ్లింది. 5 ఎకరాలు కౌలుకుతీసుకొని వరి వేశా. దీనిలో 5 ఎకరాలు పూర్తిగా కుళ్లిపోయింది. నష్టం రూ.60 వేలు వరకు నష్టం ఉంది. వ్యవసాయ మోటార్లు, అనుబంధ పరికరాలు పాడయ్యాయి. సాయం అందేవిధంగా చూడాలి.

జిఓ 85ను రద్దు చేసే వరకూ ఆందోళనలు

ప్రజాశక్తి కలెక్టరేట్ (కృష్ణా) : జిఓ 85ని రద్దు చేసే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రాధమిక ఆరోగ్య కేంద్రం వైద్యుల సంఘం కృష్ణా జిల్లా కమిటీ స్పష్టం చేసింది.వైద్యులకు నష్టం చేసే జిఓ 85 ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రాధమిక ఆరోగ్య కేంద్రం వైద్యుల సంఘం కృష్ణా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న నిరసన దీక్షలు మూడవ రోజు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా పలువురు అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ జి ఓ 85 వల్ల సర్వీసెస్ చేస్తున్న వైద్యులు నష్టపోతున్నారని, పీజీ వైద్య విద్య తమ హక్కు అని, తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. ప్రభుత్వం స్పందించే జిఓ రద్దు చేసే వరకు ఆందోళన విరమించేది లేదన్నారు. ఆందోళనలో భాగంగా సోమవారం చలో విజయవాడ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో వైద్యులు అరుణ్ కుమార్,దీప్తి, చరణ్ , అల్తాఫ్, జిల్లాలోని పలువురు వైద్యులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్లో 'మీ కోసం'

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రజలను కోరారు.

కీర్తి, రితికలకు రజత పతకం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం ఎంపిసి విద్యార్థినులు కీర్తి, రితికలు విశాఖ పట్నం లో జరిగిన ఆంధ్రప్రదేశ్ అంతర జిల్లాల అండర్ -19 త్రో బాల్ ఛాంపియన్ షిప్ పోటీలలో కృష్ణా జిల్లా నుండి ప్రాతినిధ్యం వహించి తొలి ప్రయత్నంలోనే రజత పతకం సాధించినట్లు కోచ్ నాగరాజు తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులను పలువురు అభినందించారు.

కలెక్టర్ కుటుంబం ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని డోకిపర్రు గ్రామంలోని భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ డికె బాలాజీ కుటుంబ సభ్యులతో కలసి దర్శనం చేసుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శేష వస్త్రములను అందజేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ కనకదుర్గ, ఆర్ ఐ షకీలా బేగం, కార్యదర్శి రమేష్, వీఆర్వో ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కలెక్టర్ కుటుంబం

దళిత, గిరిజన ఉద్యోగులపై దాడులు తగదు

ప్రజాశక్తి-చల్లపల్లి : విధుల్లో ఉన్న దళిత, గిరిజన ఉద్యోగులు,అధికారులపై దాడులను ప్రతి ఘటించాలని ఎస్సీ,ఎస్టి ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు ఉద్యోగులకు సూచించారు. చల్లపల్లి లో ఆదివారం ఆయన మాట్లాడుతూ కాకినాడ మెడికల్ కాలేజీ లో దళిత ప్రొఫెసర్ డాక్టర్ ఉమామహేశ్వరరావు పై స్థానిక శాసనసభ్యులు పంతం నానాజీ బూతులు తిడుతూ దౌర్జన్యానికి పాల్పడడాన్ని తీవ్రంగా ఖండించారు. డాక్టర్ ఉమామహేశ్వరరావు దళితుడు కాబట్టే శాసనసభ్యులు నానాజీ దౌర్జన్యానికి పాల్పడ్డారని పేర్కొన్నారు.వందల మంది సమక్షంలో ప్రొఫెసర్ పై తీవ్రమైన దుర్భాషలాడుతూ దౌర్జన్యానికి పాల్పడి తరువాత క్షమాపణలు చెబితే సరిపోతుందా అని ప్రశ్నించారు. బిఆర్ అంబేద్కర్ ఇచ్చిన ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటూ అవమానాలను,దాడులను ప్రతిఘటించాలి తప్ప రాజీ పడకూడదన్నారు. ఎమ్మెల్యే నానాజీపై చట్ట ప్రకారం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సురేష్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కొండాలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ఉమ్మడి జిల్లాలలో ప్రసిద్ధిగాంచిన మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్న శ్రీ కొండాలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం సందర్భంగా శ్రీ అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శనం చేసుకున్నారు. సుమారు 22 వేల మంది భక్తులు దర్శించుకొని, శ్రీ అమ్మవారికి పాలపొంగళ్ళు సమర్పించి వారి యొక్క మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారి దేవస్థానానికి విచ్చేసిన భక్తులకు ఏ విధమైన అసౌకర్యాలు కలగకుండా శ్రీ అమ్మవారి దర్శనం చేసుకునేందుకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు ఏర్పాట్లను పరిశీలించారు.

ప్రధాన రహదారిపై భారీ గొయ్యి

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండల పరిధిలోని దేవరకోట గ్రామ ప్రధాన రహదారి నుంచి పుచ్చగడ్డ వెళ్లే రహదారికి మధ్యలో నీటి ఊట ఏర్పడి ఒక్కసారిగా కోతకు గురవ్వుతూ ప్రధాన రహదారిపై భారీ గొయ్యి ఏర్పడింది. దీంతో ఈ విషయం గమనించిన పలువురు తాటి బొందు ఏర్పాటుచేసి ఈ ప్రాంతంలో ప్రమాద ాకరంగా ఉందని సూచికగా ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారిలో భారీగా గొయ్యి పడినప్పటికీ పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు ఈ ప్రాంతంలోనే నూతనంగా రహదారి మరమ్మతులు చేసి తారు రోడ్డు వేయడం జరిగింది. రాత్రివేళ ఏ మాత్రం ఆదమరిచి ప్రయాణం చేసినా గాయాలపాలు కాక తప్పదని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి గొయ్యి పూడ్చేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

భారీగా గొయ్యి పడటంతో తాటిబొందు ఏర్పాటు చేసిన దృశ్యం

వేములపల్లికి ఘన నివాళి

నాగేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-మోపిదేవి : దశాబ్దాల తరబడి దున్నేవాడికి భూమి నినాదంతో జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడి భూమిని రైతులకు పంపిణీ చేసిన ఘనత కమ్యూనిస్టులుదేనని సిపిఎం కృష్ణా జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు అన్నారు. ఆదివారం మోపిదేవి మండలం నాగాయతిప్ప గ్రామంలో వేములపల్లి నాగేశ్వరరావు 37వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాకినేని బసవ పున్నయ్య, గుంటూరు బాపనయ్య తదితరుల త్యాగమూర్తులను అందించిన నేల ఈ నాగయ్యతిప్ప అని పేర్కొన్నారు. సిపిఎం అగ్రనేత సీతారాం ఏచూరి అమరులైతే ఆయనకు కమ్యూనిస్టు పార్టీ నాయకులే కాదు దేశంలో ప్రధాన రాజకీయపక్షాల నేతలు నివాళులర్పించడం కమ్యూనిస్టుల గొప్పతనం అన్నారు. ఇటీవల వరదలు ధాటికి సమస్తం కోల్పోయిన ప్రజలకు ప్రభుత్వం ఇచ్చే సహాయం ఎంత మేరకు ఉపయోగపడుతుందని, లక్షల్లో పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేసిన రైతులకు వేలల్లో పరిహారం ఇస్తానంటే సరిపోతుందా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మోపిదేవి మండల కార్యదర్శి బండి ఆదిశేషు, సిఐటియు మండల కార్యదర్శి చాట్రగడ్డ రాజశేఖర్, నాగాయతిప్ప శాఖ కార్యదర్శి తాత వెంకటేశ్వరరావు, మరీదు సురేష్, మద్దాల వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

'అక్షరశిల్పి ఆత్రేయ' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: తెలుగు సాహిత్యంలో కీర్తిగడించిన ఆత్రేయను మనసున్నవారు మరువలేరని ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ అన్నారు. ఆదివారం సాయంత్రం లిఎక్స్ రేలి సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ నిర్వహణలో హోటల్ ఐలాపురంలో సినీ సాహిత్య పరిశోధకులు డాక్టర్ పైడిపాల వ్యాససంపుటి అక్షరశిల్పి ఆత్రేయ పుస్తకావిష్కరణ సభ జరిగింది. సభాప్రారంభకులుగా విచ్చేసిన యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ప్రసంగం కొనసాగిస్తూ మనిషి జీవితాన్ని అవపోసనపట్టి ఆణిముత్యాల వంటి సినిమా పాటలను ఆత్రేయ అందించారని అన్నారు. విశిష్ట అతిథి సినీ దర్శకులు యస్ వి కష్ణా రెడ్డి మాట్లాడుతూ కేవలం ఆత్రేయ మాటలు, పాటల ద్వారానే ఆనాటి సినిమాలు అద్భుత విజయం సాధించడం గమనార్హం అన్నారు. సీనియర్ జర్నలిస్ట్ రెంటాల జయదేవ పుస్తక సమీక్షచేస్తూ ఆత్రేయ సాహిత్య సారాన్ని పుస్తక రూపంలో మనకు అందించిన పైడిపాల కషి అభినందనీయం అన్నారు, సామాన్యుల జీవితాలను ప్రతిభింభించే రచనలను ఆత్రేయ అందించారని జయదేవ అన్నారు. ప్రముఖ మానసిక వైద్యులు ఇండ్ల రామసుబ్బా రెడ్డి మాట్లాడుతూ నిత్యజీవితంలో ఎదురయ్యే మానసిక వత్తిడులే మనిషిని పిచ్చివాణ్ణి చేస్తుందని, ఆత్రేయ పాటలు మనస్సుకి ఆహ్లాదం కల్గిస్తాయన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఎక్స్ రే అధ్యక్షులు కొల్లూరి మాట్లాడుతూ పైడిపాల పరిణతిగల రచయిత అంటూ, ఆత్రేయ సాహిత్యంలోని గొప్పతనాన్ని సామాన్యులకు అర్ధమయ్యేవిదంగా ఈ పుస్తకం రచించారని తెలిపారు. పుస్తక రచయిత ఢాక్టర్ పైడిపాల సత్కార అనంతరం ప్రసంగిస్తూ మనస్సు లోని మలినాల్ని తొలగించి స్వాంతన చేకూర్చేది ఆత్రేయ సాహిత్యం అన్నారు. సంస్థ కార్యదర్శి బోడి ఆంజనేయ రాజు స్వాగతం పలుకుతూ జనచైతన్యం కల్గించే సాహిత్యాన్ని మనం ప్రోత్సహించాలన్నారు. సంస్థ కోశాధికారి చామర్తి వెంకట సుబ్బయ్య, కందికొండ రవికిరణ్, పొత్తూరి సీతారామారావు, గుర్రం ఏడుకొండలు, కొల్లూరి కనకవల్లి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ

విజయవాడ: వరద ప్రభావిత ప్రాంతాలైన సుందరయ్య నగర్, న్యూ రాజరాజేశ్వరి పేట, ఉడా కాలనీ వరద బాధితులకు డీఎస్ఓ పూర్వ విద్యార్థులు, హైదరాబాద్ నాదయోగ సాంస్కృతిక సంస్థ సంయుక్తంగా దుప్పటి, టవలు, చీర, లుంగి ఒక కిట్‌గా అందజేశారు. డీఎస్ఓ పూర్వ విద్యార్థి నాయకురాలు గంగాభవాని, నాదయోగ సాంస్కృతిక సంస్థ ఫౌండర్ నాగవర్ధిని మాట్లాడుతూ విజయవాడ వరద బాధితులకు మానవతా దృక్పథంతో తమకు చేతనైనంత సాయం చేయటం సంతోషంగా ఉందని అన్నారు. బాధిత ప్రజలకు స్వచ్ఛంద సంస్థలు వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు మానవతా దృక్పథంతో ఎంతో సాయం అందజేస్తున్నారని, అయినప్పటికీ అది వారి బాధలు తీర్చలేవని, ప్రభుత్వం కూడా అర్హులైన వరద బాధితులందరికీ సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాదయోగ సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు డాక్టర్ నవీన్ చెట్టి, డీఎస్ఓ పూర్వ విద్యార్థి నాయకులు టి నరసింహారావు, శ్రీనివాస్, నారాయణరెడ్డి, లక్ష్మి, నాదయోగ కార్యదర్శి స్వాతి శ్రీధర్, ఉప కార్యదర్శి ప్రజ్ఞ, సభ్యులు నూక తోటి శరత్ బాబు తదితరులు పాల్గొన్నారు. తాము చేపట్టిన ఈ చిరు సహాయ కార్యక్రమానికి సహకరించిన త్రినేత్ర అపార్ట్మెంట్ ప్రెసిడెంట్ గద్దె శ్రీనివాసరావు, బి శ్రీదేవి, శిరీష, సాకేత్, పాలమాని ప్రసాద్, మద్దిశెట్టి నాగరాజు, లావణ్య, సర్నాల సురేష్, సబ్ ఎడిటర్ శ్రీధర్, కే దుర్గ, పి పద్మ, లక్ష్మి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

శాస్త్రవేత్త జానకీరామయ్యకు సత్కారం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: విజయవాడ వాసి, కెఎల్ యు ఆచార్యులు డాక్టర్ ఎం.జానకి రామయ్యకు అంతర్జాతీయ శాస్త్రవేత్తగా వరుసగా నాల్గోసారి వచ్చిన సందర్భంగా ఆయనను విజయవాడకు చెందిన భువన విజయం కళా కేంద్రం, ప్రోగ్రెసివ్ సపాయ్ కర్మ చారిస్ సంఘం, సైన్స్ మరియు వైజ్ఞానిక అభివద్ధి సంఘం సభ్యులు ఆదివారం విజయవాడ గాంధీనగర్ లోని భువన విజయం కళా కేంద్రం సంఘం కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. భువన విజయం కళాకేంద్ర వ్యవస్థాపక అధ్యక్షులు మేడిశెట్టి శేషగిరి మాట్లాడుతూ దేశం కోసం సైన్స్ ప్రజల కోసం సైన్స్ అని అన్నారు. వివేకానంద యువజన సంఘం అధ్యక్షులు చనుమోలు రామచంద్రరావు మాట్లాడుతూ మెదడు కేన్సర్‌పై, డయాగ్నోసిస్ మెడికల్ డ్రగ్స్ వంటి పలు కీలకమైన అంశాలపైన పరిశోధన చేసి మానవాళికి తనదైన శైలిలో విలువైన సేవలు అందించిన డాక్టర్ ఎం జానకీరామయ్యను సన్మానించడం తమ అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రెసివ్ సపాయ్ కర్మ చారిస్ సంఘం అసిస్టెంట్ ప్రధాన కార్యదర్శి కీర్తి ప్రకాష్, సైన్స్ మరియు వైజ్ఞానిక అభివృద్ధి సంఘం సభ్యులు ఎం.జగన్‌మోహన్‌రెడ్డి, కె.ధనయ్య, జె.దాస్, బొత్స సత్యనారాయణ, లంకా రాంబాబు, వడ్డే ప్రకాష్, కూరపాటి మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

మోహనరావు ఆస్పత్రిలో ఆర్థోస్కోపీ విజయవంతం

డాక్టర్ మామిడి రత్నమోహనరావు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కొండపల్లి డాక్టర్ మోహనరావు మెమోరియల్ ట్రస్ట్ హాస్పిటల్ లో ఆర్థోస్కోపీ (కీ హక్షల్) ద్వారా మోకాలికి కోత లేకుండా చిన్న రంధ్రాలు ఏర్పాటు చేసి వాటి ద్వారా ఆధునాతన సర్జరీని నిర్వహించినట్లు ప్రముఖ ఆర్థోపెడిక్ అండ్ ట్రామా సర్జన్ డాక్టర్ మామిడి రత్న మోహనరావు తెలిపారు.. ఇలాంటి అత్యాధునిక శస్త్ర చికిత్స ఈ ప్రాంతంలో నిర్వహించడం ఇదే ప్రథమం కావడం విశేషమన్నారు.. ఈ సందర్భంగా హాస్పిటల్ లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సర్జరీకి సంబంధించిన వివరాలను వెల్లడించారు. కొండపల్లి కి చెందిన ఓ యువతి (24) బైక్ పైనుంచి కింద పడడంతో మోకాలిలో లెగ్‌మెంట్స్ (ఎముకకు ఎముకకు కనెక్షన్) కట్ అయిందన్నారు. మోకాలి పక్కన కండరాలు తీసి లెగ్ మెంట్స్ కట్ అయిన చోట అమర్చినట్లు చెప్పారు. మోకాలికి కోత లేకుండా చిన్నచిన్న రంధ్రాలు ఏర్పాటు చేసి ఈ సర్జరీని విజయవంతంగా పూర్తి చేసినట్లు వివరించారు. దీంతో నెలన్నర రోజుల్లోనే పూర్తి స్థాయిలో కోలుకోవచ్చున్నారు. శస్త్ర చికిత్స చేసిన రెండో రోజే పేషెంట్ ను నడిపించినట్లు వివరించారు. ఆర్థోస్కోపీ శస్త్ర చికిత్స ద్వారా లెగ్ మెంట్స్, మెనీ స్కెస్ గాయాలను సరి చేసుకోవచ్చున్నారు. ఈ ప్రాంత ప్రజలకు చేరువలో, సామాన్యులకు సైతం అందుబాటులో కార్పొరేట్ వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తిరుపతమ్మ ఆలయంలో ప్రసాదం సామాగ్రి పరిశీలన

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: టిటిడి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగం కలకలం రేగడంతో ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల ప్రసాదాల తయారీపై దృష్టి సారించిందని అందులో భాగంగానే ఆదివారం శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో లడ్డూ తయారీకి వినియోగించే పదార్థాలను పరిశీలించడం జరిగిందని స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య తెలిపారు. ఆలయంలోని లడ్డు ప్రసాదం తయారు కేంద్రాలను, వంటశాలను ఆకస్మిక తనిఖీలు చేశారు. అలాగే ముడి సరుకులు నెయ్యి, జీడిపప్పు, శనగపిండి నాసిరకంగా ఉన్నట్లు తెలిపారు. మిగిలిన సరకుల నాణ్యత నిర్ధారణ చేయాలని ఆయన ఆలయ అధికారులను ఆదేశించారు.

పశువులకు టీకాలు వేయాలి

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ డివిజనల్ పశు సంవర్ధక శాఖ డివిజనల్ డైరెక్టర్. డాక్టర్.మోసెస్ వెస్లి ఆధ్వర్యంలో జాతీయ లైవ్ స్టాక్ మిషన్ పై నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎన్టీఆర్ జిల్లా జెడి డాక్టర్ హనుమంతరావు శనివారం సాయంత్రం డివిజన్ పరిధిలోని పశు సంవర్ధక శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ అధికారులు అందరు తమకు కేటాయించిన లక్ష్యాలను నిర్దేశించిన సమయానికి లోబడి త్వరితగతిన పూర్తిచేయాలని అన్నారు. ముఖ్యంగా ఇటీవల వరద ప్రభావిత ప్రాంతాలలో పర్యటించి అనారోగ్యమైన పశువులకు త్వరితగతిన టీకాలు వేయాలని అన్నారు. తమకు కేటాయించిన వైద్యశాలలో రోజూ ఎన్ని పశువులకు వైద్యం అందిస్తున్నారు , ఎన్ని టీకాలు వేస్తున్నారు, ఎన్ని డీ వార్మింగ్ కేసులు చేస్తున్నారు, ఎన్ని పశువులకు సెక్స్ సార్టెడ్ సెమన్ చేస్తున్నారు, ఎన్ని పశువులకు సెమన్ చేస్తున్నారు, సప్పీడీ గడ్డి విత్తనాలు గురించి, వరద ప్రాంతాలలో సప్పీడీ పశువుల దాణా అందించే దాని గురించి తదితర అంశాలపై చర్చించారు.

కవికాలమ్

ఆకులు రాల్చె ఆనంద బాష్పాలు..!!

వరుణుడు కరుణించాడు
ఊరంతా జోరుగా వాన..!
జడి వానలకు సంకేతాలు
ఉరుములు మెరుపులు..!

వేడెక్కిన పుడమి తల్లి
కడుపు నిండా నీరు తాగి
దాహార్తిని చల్లగా తీర్చుకుంది..!
ఉక్క పోత వాతావరణానికి
వర్షం చినుకుల తోరణాలు కట్టగా
ఆబాల గోపాలం అనంత హర్షం ..!!

రహదారుల మీద పల్లె పడుచు
పరుగులెత్తు తున్నట్టు వరద నీరు
ఎండిపోయిన ఊర చెరువులోకి
నిండు కుండ తొణికినట్టు వాన నీరు!

మురికి రోడ్లను శుభ్రంగా కడిగిన
వాన దేవుడు కాస్త శాంతించాడు.!
చెట్లన్నీ తలంటు స్నానాలు చేశాయి
వరుణ దేవుడికి కతజ్ఞతలు చెప్పినట్లుగా
ఆకులు రాల్చె ఆనంద బాష్పాలు..!!
మాగాణి చేలలోని రాజనాల మట్టి నానింది
చలిమిడి పరిమళాలు నలుదిక్కుల
వ్యాపించే..!!

జి.సూర్యనారాయణ, 6281725659.

అలరించిన నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని తొర్రగుంటపాలెం గ్రామంలో వినాయకుని మండపంలో ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో భవాని కూచిపూడి నత్య అకాడమీ యర్రబోలు భవాని శిక్షకురాలు ఆధ్వర్యంలో విద్యార్థులు దీపాలను చేతిలో పట్టుకొని చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం ప్రదర్శనలు నిర్వహించిన వారికి మెమోంటోలు అందజేశారు. నృత్య అకాడమీ నిర్వాహకులు భవానీని సత్కరించారు.

చేనేత కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-నందిగామ: ప్రతి ఒక్కరు వారంలో ఒక రోజైనా చేనేత వస్త్రాలు ధరించాలని తద్వారా చేనేత వృత్తి కళాకారులను ఆదుకున్నట్లు అవుతుందని, ఆ కల అంతరించిపోకుండా కాపాడుకున్న వాళ్ళం అవుతామని పద్మశాలి చేనేత సంఘం నందిగామ నియోజకవర్గ అధ్యక్షుడు తుమ్మ జగన్నాథం సభ్యులకు పిలుపునిచ్చారు. నందిగామ నియోజకవర్గ చేనేత పద్మశాలి సేవా సంఘం సమావేశం నందిగామ రైతు పేటలోని కంచర్ల సుబ్బారావు భవనంలో ఆదివారం జరిగింది. చేనేత వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి అధికారులకు సమస్యల పరిష్కారం కొరకు వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయించారు. ప్రతి ఒక్కరు వారంలో ఒక రోజైనా చేనేత వస్త్రాలు ధరించాలని తద్వారా చేనేత వత్తి కళాకారులను ఆదుకున్నట్లు అవుతుందని, ఆ కల అంతరించిపోకుండా కాపాడుకున్న వాళ్ళం అవుతామని ఈ సందర్భంగా అధ్యక్షుడు తుమ్మ జగన్నాథం సభ్యులకు పిలుపునిచ్చారు. అనంతరం నందిగామ నియోజకవర్గ శాసనసభ్యులు తంగిరాల సౌమ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి బిట్ర సుబ్బారావు, గౌరవాధ్యక్షులు చలమల సత్యనారాయణ, కార్యదర్శి జి.వెంకటేశ్వరరావు, జి.శివ, గడ్డం లక్ష్మీనారాయణ, చిన్నం నరసింహారావు, దామెర్ల నాగరాజు, మహేశ్వర వెంకటేశ్వరరావు, పులిపాటి నరసింహారావు, లక్ష్మీనారాయణ, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎ తంగిరాల సౌమ్యకు వినతిపత్రం అందజేస్తున్న పద్మశాలి చేనేత సంఘం నాయకులు

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : వరదలలో నష్టపోయిన రైతు కౌలు రైతులను ఆదుకోవాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు అన్నారు. ఈనెల 24వ తేదీన రైతులు- కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తోట్లవల్లూరు సెంటర్లో సదస్సు నిర్వహిస్తున్నామని, రైతులు విరివిగా పాల్గొని సదస్సును జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆదివారం రైతుల తరపున ప్రభుత్వానికి డిమాండ్లతో కూడిన కరపత్రాలను గ్రామ గ్రామాన పంపిణీ చేసి ఇంటింటికి తిరిగి వివరించారు. కంద, పసుపు,తమలపాకు వంటి వాణిజ్య పంటలు వేసిన రైతులు ఎకరాకు మూడు లక్షల రూపాయల వరకు ఖర్చు పెట్టారని ప్రభుత్వం ప్రకటించిన ముంపు సాయం వల్ల రైతుకు ఉపయోగము లేదని దీనిని పెంచి ఎకరాకు లక్ష రూపాయల వరకు ఇవ్వాలన్నారు. అలాగే వరికి రూ. 25 వేల వరకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇసుక మేటలు వేసిన భూములను ప్రభుత్వం బాగు చేసి రైతులకు ఇవ్వాలని, పాడైపోయిన మోటార్లను రైతులకు బాగు చేసి ఇవ్వాలని, రెండో పంట సాగు చేసుకోవడానికి అనుకూలమైన మినుము, మొక్కజొన్న విత్తనాలను ప్రజలకు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వి శివ నాగేంద్ర, ఉపాధ్యక్షురాలు శైలజ, మండల కౌలు రైతు సంఘం అధ్యక్షుడు సిహెచ్ సుబ్బారావు, రైతు నాయకులు కొండల బాబు,వీరంకి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సింహాద్రి రమేష్

హామీలు అమలు చేయలేకే ఆరోపణలు : సింహాద్రి

ప్రజాశక్తి-అవనిగడ్డ : రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోలేక ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు తిరుపతి లడ్డు కల్తీ అని తెరపైకి తెచ్చారని అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ సింహాద్రి రమేష్ బాబు తీవ్రంగా విమర్శించారు. ఆదివారం పార్టీ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పై ఏదో రకంగా కక్ష సాధించాలని సంకల్పంతోటి హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా చంద్రబాబు నాయుడు ప్రచారం మొదలు పెట్టారన్నారు. అదేవిధంగా ఏటి మొగ ఎదురు మొండి బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి కూడా రూ 109 కోట్లు మంజూరై ఉన్నాయని మొదట బ్రిడ్జి నిర్మాణం పనులు మొదలు పెడితే ఆ ప్రాంత ప్రజలు సంతోషిస్తారన్నారు. ఆ పార్టీ నాయకులు కడవకొల్లు నరసింహారావు, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు

'స్వచ్ఛతా హి సేవ'పై అవగాహన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రమైన గుడ్లవల్లేరు గ్రామంలో , షాప్‌ల నిర్వాహకులకు ప్లాస్టిక్ వ్యర్థాలు, విద్యుత్ వినియోగ నిర్వహణపై అవగాహన కల్పించారు. పారిశుధ్య కార్మికులతో డ్రైన్‌లు పూడికలు తీయించి బ్లీచింగ్ చెల్లించినట్లు పంచాయతీ కార్యదర్శి నరసింహారావు తెలిపారు.

ముగిసిన షటిల్ పోటీలు

ప్రజాశక్తి-గన్నవరం : స్థానిక కెవిఆర్ ఇండోర్ స్టేడియంలో గత మూడు రోజులుగా జరుగుతున్న ఉమ్మడి కృష్ణాజిల్లా పురుషుల షటిల్ పోటీలు ఆదివారం ముగిశాయి. సాయంత్రం జరిగిన 45 ఏళ్ల పైబడిన విభాగంలో మధురనగర్ జట్టు విజేతగా నిలవగా నూజివీడు జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. మూడోవ స్థానంలో గన్నవరం జట్టు, నాల్గవ స్థానంలో హనుమాన్ జంక్షన్ జట్టు నిలిచాయి. 45 ఏళ్లలోపు విభాగంలో నందిగామ జట్టు విజేతగా, విజయవాడ జట్టు రన్నర్ గా, మధురనగర్, గన్నవరం జట్లు మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాయి. అనంతరం రెండు విభాగాల్లో వరుసగా నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు ఏఎంసి మాజీ ఛైర్మన్ పొట్లూరి బసవరావు కెవిఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కెవి, రమణ, కార్యదర్శి కెవిఆర్. కిషోర్ చేతుల మీదుగా నగదు బహుమతులు, షీల్డ్స్ అందుకున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి ఎస్ ఆర్. మూర్తి, మాజీ అధ్యక్షులు అమర్తల సోమేశ్వరరావు, ముస్తాబాధ సొసైటీ మాజీ ఛైర్మన్ శ్రీనివాస చౌదరి, న్యాయవాదులు నల్లమోతు రమేష్, ప్రకాష్, టిడిపి నేత నిడమర్తి బుజ్జారావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు నిత్యావసరాలు పంపిణీ

కార్మికులకు నిత్యావసరాలు అందిస్తున్న సిఐటియు జిల్లా నాయకులు దోనేపూడి కాశీనాథ్

ప్రజాశక్తి-విజయవాడ : వరద బాధితుల సహాయార్థం విజయవాడలోని స్థానిక కొత్త ప్రభుత్వ ఆసుపత్రిలో శానిటేషన్, సెక్యూరిటీ కాంట్రాక్ట్ మహిళ కార్మికులకు సిఐటియు ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా నాయకులు దోనేపూడి కాశీనాథ్ హాజరై కార్మికులకు నిత్యావసర వస్తువులు కిట్లను అందించారు. కిట్లను అందించిన డాక్టర్సుకి, ఏజిల్ గ్రూప్ సంస్థకి. ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిత్యం రోగులకు సహాయ చర్యలు అందిస్తున్న పారిశుద్ధ కార్మికులకు చేయూత ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ తూర్పు సిటీ సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు కోట బాబు, విబి రాజు, శానిటేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్. తిరుపతమ్మ, ఐ భాస్కరమ్మ, యూనియన్ శానిటేషన్ నాయకులు, వి కోటేశ్వరమ్మఎస్.కె అఖిల, కే కష్ణకుమారి, రత్నకుమారి పాల్గొన్నారు.

వరద బాధితులకు పలు సంస్థలు సాయం

అవనిగడ్డ మండలం పాతఎడ్లలంకలో ఫెయిత్ టెంపుల్ మినిస్ట్రీస్ బాధితులకు అందజేస్తున్న సాయం

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఇటీవల కష్ణా నదికి వచ్చిన వరదల వల్ల తీవ్రంగా నష్టపోయిన బాధితులకు పలు సంఘాలు సహాయం అందజేశాయి. ఆదివారం మండల పరిధిలోని పులిగడ్డ పంచాయతీ శివారు రేగులంక పల్లెపాలెం అవనిగడ్డ పంచాయతీలు వసుమట్ల గ్రామాలకు చెందిన బాధితులు 350 కుటుంబాలకు ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ పిలుపుమేరకు నియోజకవర్గ విద్యా కుటుంబం సమీకరించిన నిధుల నుండి వంట పాత్రలు, కుక్కర్లు, బకెట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే తనయుడు నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రాం ఎంపీపీ తుంగల సుమతి దేవి చేతుల మీదుగా పంపిణీ చేశారు. జనసేన మండల పార్టీ అధ్యక్షులు గుడివాక శేషుబాబు, గ్రామ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్, ఉప సర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, మండల ఉపాధ్యక్షులు పులిగడ్డ ఇచ్చేశ్వరరావు పాల్గొన్నారు. అదేవిధంగా పాత ఎడ్ల లంకలో వరద బాధితులకు టెంపుల్ మినిస్ట్రీస్ అధ్యక్షులు డేవిడ్ శామ్యూల్ ఆధ్వర్యంలో బాధితులకు మరోసారి 15 కేజీల బియ్యం పప్పు మంచి నూనె పప్పు దినుసులు కూరగాయలు పంపిణీ చేశారు. అదేవిధంగా పులిగడ్డ ఎడ్ల లంక గ్రామంలోని 200 మత్స్యకార కుటుంబాలకు నాగాయలంక మండలం ఎదురు మొండి గ్రామంలో 150 కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ 1500 రూపాయల ఖరీదు చేసే సహాయాన్ని అందజేశారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** వరద బాధిత కుటుంబాలకు నిత్యవసర సరుకులను హై 5 యూత్ ఫౌండేషన్ ఆదివారం పంపిణీ చేసింది. గుడివాడ నియోజకవర్గంలోని పుట్టగుంట చందుర్తిపాడు నందివాడలో నిత్యవసర వస్తువులు అందజేశారు. అలాగే విజయవాడలోని సింగినగర్ పైపుల్ రోడ్డు బోబే కాలనీలోని 770 వరద బాధిత కుటుంబాలకు నిత్యవసర వస్తువులు కూరగాయలు బిస్కెట్ ప్యాకెట్ ప్యాకెట్లను పంపిణీ చేసినట్లు హై5 యూత్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ గోట్రు నాగబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో హై5 యూత్ ఫౌండేషన్ సెక్రటరీ కళివరపు రంగారావు, ఉపాధ్యక్షులు పత్తిపాటి రవి, సహాయ కార్యదర్శి మంద సాంబశివరావు, మీడియా కన్వీనర్ నూకతోటి నాగరాజు , సభ్యులు దుర్గరాజు, బోడపాటి రాజు కూమార్ పాల్గొన్నారు.

వైసిపికి పలువురు రాజీనామా

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం మండలంలో వైసిపికి పలువురు రాజీనామా చేశారు. పేర్ని నానికి సుదీర్ఘకాలం వీరవిదేయులుగా వున్న తాళ్లపాలెం మాజీ సర్పంచ్ వాలిశెట్టి రవిశంకర్,కానూరు పిఎసిఎస్ అధ్యక్షులు, కెడిసిసి మాజీ డైరెక్టర్ శ్రీకాకుళపు నాగేశ్వరరావు (బాబు) ఫిషర్ మ్యాన్ సొసైటీ అధ్యక్షుడు వీర రాఘవయ్య మరో పదిమంది నాయకులు ఆదివారం పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ వైసిపి పార్టీ కి విశేష సేవలందించిన తమను స్థానిక నాయకత్వం గుర్తించలేదన్నారు. పార్టీలో ఆది నుంచీ తన వర్గాలను అవమానాలకు గురిచేసారనీ వాటిని భరించలేక రాజీనామా చేసానని రవిశంకర్ తెలిపారు. శ్రీకాకుళపు నాగేశ్వరరావు మాట్లాడుతూ మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని)చీటర్లను పక్కన పెట్టుకుని పార్టీ కోసం కష్టపడిన తమ పట్ల వివక్షతకు గురి చేశాడని తెలిపారు.

ఎంఎల్ఎకు సమస్యలు ఏకరువు

ప్రజాశక్తి-పెడన : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రవేశపెట్టిన వందరోజుల పండుగ పురస్కరించుకొని పెడన ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్‌కు సమస్యలతో ప్రజలు ఏకరువు పెట్టారు. స్థానిక మార్కెట్ యార్డ్‌లోని ఏర్పాటుచేసిన వంద రోజులు పండుగ పురస్కరించుకుని పలువురు, మహిళలు అలాగే పేదలు ఎమ్మెల్యే ముందు సమస్యలు విన్నవించుకున్నారు. పట్నంలోని హనుమాన్ కాలనీలో, సిమెంట్ రోడ్లు లేవని అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే గ్యాస్ సిలిండర్లు అందరికీ సమానంగా అందేలా చూడాలని, అంతేకాకుండా అమ్మ ఒడి తల్లికి వందనం పథకంతో పాటు మరిన్ని ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలు నెరవేర్చాలని ఎమ్మెల్యేకు స్థానికులు సమస్యలు విన్నవించారు. సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ఎంఎల్ఎ చెప్పారు.

'ఇది మంచి ప్రభుత్వం'

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : మండలంలోని తోట్లవల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాముల లంక గ్రామానికి కాజ్వే నిర్మాణానికి డ్రోన్ సర్వే చేయించానని త్వరలోనే నిర్మాణం పూర్తి చేస్తానని అన్నారు. మండల టిడిపి అధ్యక్షులు శివరాం ప్రసాద్, జనసేన పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి తాడిశెట్టి నరేష్, కష్ణ సుమన్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఘంటసాల :** ఘంటసాల మండల పరిధిలోని ఘంటసాలపాలెం గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. పంచాయతీ కార్యదర్శి బోలెం అర్జునరావు, పంచాయతీ సిబ్బంది, టీడీపీ నేతలు ఇంటింటికి తిరిగి ప్రభుత్వం 100 రోజుల కూటమి పాలనలో చేసిన కార్యక్రమాల గురించి వివరించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడ ఐఎంఏ అసోసియేషన్ చరిత్రలో జరగని విధంగా ఓకే రోజున 3 చోట్ల మెగా మెడికల్ క్యాంపు నిర్వహించడం గొప్ప విషయమని అసోసియేషన్ అధ్యక్షా, కార్యదర్శులు పాలడుగు వెంకట్రావ్, పిన్నమనేని శివరామకృష్ణ ప్రసాద్‌లు అన్నారు. ఆదివారం నందివాడ మండలంలో రామపురం, రుద్రపాక, పుట్టగుంటలో మెగా మెడికల్ క్యాంపును గుడివాడ ఐఎంఏ బ్రాంచ్ అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షా, కార్యదర్శులు పాలడుగు, పిన్నమనేనిలు మాట్లాడుతూ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పిలుపు మేరకు అసోసియేషన్ వైద్యులు చర్మవ్యాధులు, షుగర్, ముక్కు, చెవి,గొంతు, కండరాలు, ఎముకలు, పళ్లు తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని, విశేష స్పందన లభించినట్లు తెలిపారు. మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పిన్నమనేని బాబ్జీ, పిన్నమనేని వీరయ్యచౌదరి, రామపురం సర్పంచ్ కాకరాల సుభాష్‌చంద్రబోసు(సురేష్) టిడిపి నాయకులు యలమంచిలి సతీష్, వైద్య సిబ్బంది, గ్రామస్థులు, పాల్గొన్నారు.

ఎంబివికెలో ఆదివారం జరిగిన ఏచూరి సంతాప సభలో నివాళులర్పిస్తున్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు

లాల్ సలామ్ ఏచూరి

ఏచూరికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

పిఎన్ఎం కళాకారుల కళారూపకాలు

ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల

దేశ రాజకీయాల్లో ఏచూరి పాత్ర మరువలేనిది

ఎంబివికె ట్రస్టు చైర్మన్ పి.మధు

ప్రజాశక్తి-తిరువూరు: దేశ రాజకీయాల్లో, ముఖ్యంగా కమ్యూనిస్టు ఉద్యమాల్లో సీతారాం ఏచూరి నిర్వహించిన పాత్ర మరువలేనిదని మాజీ ఎంపీ, మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్టు చైర్మన్ పి.మధు అన్నారు. మార్క్సిజం, లెనినిజాన్ని దేశ ప్రజాఉద్యమంలో అన్వయించడంలో విశేష కృషి చేశాన్నారు. ఏచూరి 12 సంవత్సరాలు పార్లమెంట్ సభ్యులుగా ప్రజా సమస్యల పరిష్కారంపై అలుపెరగని కృషి చేశారని తెలిపారు. సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభ తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రైతుసంఘం జిల్లా సీనియర్ నాయకుడు సానికొమ్ము నాగేశ్వరరెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగింది. ముందుగా ఏచూరి చిత్రపటానికి మధు పూలమాలవేసి ఘనం గా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఏచూరి నిత్యం భారతదేశంలో పేద, మధ్యతరగతి ప్రజలు, కార్మికులు, రైతులు సంక్షేమ ంకోసమే పరితపించేవారని చెప్పారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో వేలాది మంది కమ్యూనిస్టులు ప్రాణాలర్పించారని, ఆ తర్వాత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో వందలాది మంది అమరులయ్యారని, దేశం కోసం ప్రజల కోసం ప్రాణాలు అర్పించేది కమ్యూనిస్టులు మాత్రమేనని మధు గుర్తుచేశారు. దేశంలో ధరలు అడ్డు అదుపు లేకుండా పెరిగిపోతున్నాయని, రైతాంగ సమస్యలను పట్టించుకునే నాధుడే లేడని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారం చలాయిస్తున్న పాలకులు పేదలను సైతం పీక్కు తింటున్నారని విమర్శించారు. ఈ భారాలకు వ్యతిరేకంగా పోరాడేది ఒక కమ్యూనిస్టులు మాత్రమేనని అన్నారు. మాజీ ఎమ్మెల్యే, వైసీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ నల్లగట్ల స్వామిదాస్ మాట్లాడుతూ సిద్ధాంతపరంగా రాజీలేని పోరాటం చేసిన గొప్ప వ్యక్తి సీతారాం ఏచూరి అని అన్నారు. ఆయన మరణం ప్రజా ఉద్యమానికి తీరని లోటన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్, టిడిపి సీనియర్ నాయకుడు తాళ్లూరు రామారావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే రాజకీయాలను పునికి పుచ్చుకుని జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీలో మూడుసార్లు విద్యార్థి నాయకుడిగా ఎన్నికైన ఏచూరి తెలుగువాడు కావటం గర్వంగా ఉందని అన్నారు. సిపిఐ పట్టణ కార్యదర్శి ఎం ఉదయ్, వైసిపి పట్టణ అధ్యక్షులు చలమాల సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు జి.కృష్ణమోహన్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగేంద్రప్రసాద్, ఐద్వా జిల్లా నాయకురాలు ఎస్ కుమారి, సుందరయ్య విజ్ఞాన కేంద్రం కన్వీనర్ కడిమి పాపారావు, జనసేన నాయకులు అప్పికట్ల కుమార్, మానవ హక్కుల సంఘం నాయకులు గద్దల ఆదాం తదితరులు మాట్లాడారు.

ఏచూరి సంతాప సభలో మాట్లాడుతున్న ఎంబివికె ట్రస్టు చైర్మన్ పి.మధు

సమాజాభివృద్ధికి లయన్స్ కృషి : గద్దె

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: లైన్స్ క్లబ్ అంటే సేవతో పాటు సమాజ అభివద్ధికి లీడర్స్ ని కూడా తయారు చేయడమని జిల్లా గవర్నర్ లయన్ గద్దె శేషగిరి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం నగరంలోని బెంజ్ సర్కిల్ సమీపంలో ఏర్పాటు చేసిన నూతన శాఖ స్పార్క్ ను ఆయన ప్రారంభించారు. ఇన్స్టాలేషన్ ఆఫీసర్, ఫస్ట్ వైస్ డిస్టిక్ గవర్నర్ లైన్ ఆంజనేయులు నూతన క్లబ్ ని ఇన్స్టాల్ చేయడం క్లబ్ ప్రెసిడెంట్ గా లైన్ డాక్టర్ రమేష్ బావిశెట్టి, సెక్రటరీ క్రాంతి కుమార్, ట్రెజరర్ నున్న సాంబశివరావు గారితో ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్ మెంబర్షిప్ చైర్ పర్సన్ శ్రీనివాసులు, సర్వీస్ చైర్ పర్సన్ హనుమ కుమార్, ఎల్ సి ఐ ఎఫ్ కోఆర్డినేటర్ శివశంకర్, క్లబ్బు మార్కెటింగ్ చైర్ పర్సన్ రామారావు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ మదన్ మోహన్, సాయి కష్ణ, శ్రావణి, రమాదేవి, జయరాజు లతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి డిస్టిక్ క్యాబినెట్ ట్రెజరర్ లైన్ ఈశ్వర్, జి ఎమ్ టి డిస్టిక్ కోఆర్డినేటర్ లైన్ రవీంద్ర , జిఎస్టి డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ చక్రధర్ , జిఎంటి ఫ్యామిలీ అండ్ ఉమెన్స్ స్పెషలిస్ట్ లైన్ అక్కినేని లక్ష్మీ , డిస్టిక్ అడ్మినిస్ట్రేటర్ లైన్ తుమ్మల రమేష్ బాబు, రీజియన్ చైర్ పర్సన్ లైన్ అడ్వకేట్ బండి జ్యోతి హాజరై నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు మండలం కొత్త కోకిలంపాడులో కోడి పందేల శిబిరంపై పోలీసు దాడి చేసి నలుగురిని అరెస్టు చేశారు. పోలీసు సిబ్బంది ఆదివారం సాయంత్రం పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురు జూదగాళ్లను అదుపులోకి తీసుకుని వారి నుండి రెండు కోళ్ళు, నాలుగు కత్తులు, 14 బైకులను, రూ.18 వేలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

కెఎఫ్‌సి ఉద్యోగులకు సైన్ లాంగ్వేజీలో శిక్షణ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: అంతర్జాతీయ సైన్ లాంగ్వేజ్ డే పురస్కరించుకుని తమ ఉద్యోగుల కోసం సైన్‌లాంగ్వేజ్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లుగా కెఎఫ్‌సీ ఇండియా అండ్ పార్ట్‌నర్ కంట్రీస్ జనరల్ మేనేజర్ మోక్ష్ చోప్రా తెలిపారు. ఎం. జీ రోడ్డు.లోని కె ఎఫ్ సి కార్యాలయం నందు ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. తమ కెఎఫ్‌సీ క్షమత కార్యక్రమం ద్వారా వినికిడి లోపం కలిగిన వ్యక్తుల సామర్థ్యాలను వెలికి తీయడంతో పాటుగా అవకాశాలను కూడా కల్పిస్తున్నామని అన్నారు . 2021 నుంచి తాము సైన్ లాంగ్వేజ్‌ను తమ కార్యకలాపాలలో వినియోగిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం తమ ఉద్యోగులందరూ సైన్‌లాంగ్వేజ్‌లో శిక్షణ పొందారని వెల్లడించేందుకు సంతోషిస్తున్నమన్నారు.

శామ్‌సంగ్ బిగ్ టివి ఫెస్టివల్ ప్రారంభం

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ: ఇండియా పండుగల సందర్భంగా ప్రత్యేక ఆఫర్లను టివిలపై అందించేందుకు సామ్‌సంగ్ బిగ్ టీవీ ఫెస్టివల్‌ను ప్రారంభించినట్లు సంస్థ రీజనల్ కో ఆర్డినేటర్ ఎం. సుబ్రహ్మణ్యం తెలిపారు. ఎం.జి.రోడ్డులోని శామ్‌సంగ్ షోరూమ్ నందు ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలను తెలియచేశారు. రానున్న పండుగల సందర్భంగా బిగ్ టీవీ ఫెస్టివల్‌ను ప్రారంభించామని నియో క్యూఎల్ఈడీ , నియో క్యూఎల్ఈడీ4కె, నియో క్యూ క్రిస్టల్ టీవీలపై ప్రత్యేక ఆఫర్లు ఉంటాయని తెలిపారు. ఏఐ ఆధారిత పెద్ద స్క్రీన్ టెలివిజన్‌లపై సాటిలేని డీల్‌ను అందిస్తుందన్నారు. పరిమిత వ్యవధి ఆఫర్‌లను నవంబరు 10వ తేదీ వరకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఆఫర్లతో పాటు క్యాష్‌బ్యాక్ సదుపాయం కూడా ఉందన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.